నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జగద్గిరిగుట్ట: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని జగద్గిరిగుట్ట సెక్షన్ ఏఈ రాధాకిషన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ షిర్డీహిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాజీవ్‌హిల్స్, షిర్డీహిల్స్, భూదేవి హిల్స్, కూన మహాలక్ష్మినగర్, అంజయ్యనగర్ బ్లాక్ సీ, 11కేవీ వేంకటేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు అంజయ్యనగర్, మైసమ్మనగర్, సోమయ్యనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆలయంలో అన్నదానం



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధి పేట్ బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సుమారు 500 మంది పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని సర్వే నంబర్ 342లో వెలసిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చి వేశారు. స్థానికంగా హమీద్ బస్తీలోని ప్రభు సదానందంలో రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో రెండు గదులను, ఒక ప్రహరీని నేల మట్టం చేశారు. కబ్జాలకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి

జయంతి వేడుకల్లో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

కుత్బుల్లాపూర్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేశారు. వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. 108 సేవలు, రాజీవ్ గృహకల్ప, స్వగృహ, ఇందిరమ్మ ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలతో పేద ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్, గాజులరామారం ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి శ్యామల పాల్గొన్నారు. షాపూర్‌నగర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, ప్రగతినగర్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



షాపూర్‌నగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ తదితరులు



గాజులరామారంలో సాతాల గోపాల్ నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి శ్యామల



రంగారెడ్డినగర్‌లో పూలమాలేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కాట్రెడ్డి రమణారెడ్డి తదితరులు



ప్రగతినగర్ వేడుకల్లో కొలన్ హన్మంతరెడ్డి, శ్యామల

కార్డన్‌సెర్చ్.. 39 వాహనాలు సీజ్

జీడిమెట్ల: జీడిమెట్ల పీఎస్ పరిధిలోని మార్కాండేయ నగర్‌లో మంగళవారం జీడిమెట్ల పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కార్డన్‌సెర్చ్‌లో బాలానగర్ ఏసీపీ పింగళి నరేష్‌రెడ్డి, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్, డీఐ కనకయ్య, ఆరుగురు ఎస్ఐలు, 30 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. కార్డన్‌సెర్చ్ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు కొనసాగింది. మార్కాండేయ నగర్‌లో సరైన పత్రాలు లేని 35 బైక్‌లు, 3 ఆటోలు, కారును సీజ్ చేశారు. పలువురు రౌడీషీటర్‌లకు కౌన్సిలింగ్ నిర్వహించి వారి కదలికలను అడిగి తెలుసుకున్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ నరేష్‌రెడ్డి

బాలికను మోసం చేసిన వ్యక్తి రిమాండ్

జగద్గిరిగుట్ట: ప్రేమ పేరుతో బాలికను గర్భవతి చేసిన యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధిత కుటంబీకుల వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన ఓ కుటుంబం జగద్గిరిగుట్టలో నివాసం ఉంటుంది. వీరి కుమారుడు వినోద్ (24) స్థానికంగా ఉంటున్న ఓ మైనర్‌ను ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు అతడిని మందలించారు. ఇరు కుటుంబాలు బాలిక మేజర్ అయిన తరువాత పెళ్లి చేసేందుకు అంగీకారానికి వచ్చారు. దీన్ని ఆసరాగా తీసుకున్న వినోద్ ఎవరూ లేని సమయంలో బాలిక ఇంటికి వస్తూ ఉండేవాడు. బాలిక అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చూపించగా గర్భం దాల్చినట్లు వైద్యులు తెలిపారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

డీజేకు అనుమతి తప్పనిసరి

– బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి

జగద్గిరిగుట్ట: డీజేకు పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి తప్పనిసరి అని బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో సీఐ నర్సింహ ఆధ్వర్యంలో డీజే నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చే బోనాలు, గణేష్ తదితర పండుగలు, వేడుకలకు డీజే ప్లే చేయడం పై వివరించారు. డీజే అనుమతి తీసుకోకుంటే సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈపీ యాక్ట్ 15 ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. షరతులతో కూడిన అనుమతులు ఇస్తామని, వాటికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏసీపీ నరేష్ రెడ్డి

భారత్ మానవ హక్కుల సంస్థ నేషనల్ జాయింట్ సెక్రెటరీగా దీపక్

సుభాష్‌నగర్: భారత్ మానవ హక్కుల సంస్థ జాతీయ జాయింట్ సెక్రటరీగా జింక దీపక్ ముదిరాజ్ నియమితులయ్యారు. మంగళవారం గాజులరామారంలో భారత్ మానవ హక్కుల సంస్థ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి జాతీయ జాయింట్ సెక్రటరీగా దీపక్‌ముదిరాజ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జింక శ్రీకాంత్ ముదిరాజ్‌లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. యువత సమాజ సేవలో పాలుపంచుకోవాలని, సమాజం పట్ల అంకితభావంతో ముందుకు సాగాలన్నారు. టెంపుల్ ప్రొటెక్షన్ జాకోర్ జ్యోతి, స్టేట్ మహిళా విభాగం అనిల్ కుమారి, శ్యామ్ కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న దీపక్, శ్రీకాంత్

ఆరుగురిపై న్యూసెన్స్ కేసు నమోదు

కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

కుత్బుల్లాపూర్: ప్రధాన చౌరస్తాల వద్ద భిక్షాటన చేసే వారితో పాటు హిజ్రాల ఆగడాలపై వచ్చిన కథనానికి పోలీసులు స్పందించారు. పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ సుచిత్ర చౌరస్తాలో ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు భిక్షాటన చేస్తూ వాహనదారులను ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న విషయాన్ని గుర్తించి సుమారు ఆరుగురిని అదుపులో తీసుకున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యూసెన్స్ కేసు కింద ఫైన్ వేశారు. ఇక మీదట రోడ్లపై అడుక్కోరాదని తేల్చి చెప్పారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న పేట్‌బషీరాబాద్ సీఐ

సదుపాయాల కల్పనకు కృషి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని డివిజన్1, క్రాంతి నగర్‌లో మంగళవారం రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయనను స్థానికులు సన్మానించారు. కార్యక్రమంలో కొలన్ వీరేందర్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రాజిరెడ్డి, నవీన్, ప్రభాకర్, రాజ, శ్రీధర్, సురేష్, నరసింహ పాల్గొన్నారు.

ఫిర్యాదు వస్తే కూల్చేస్తాం.. లేకుంటే వదిలేస్తాం!

ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాల కూల్చివేతలపై అధికారుల తీరు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ అధికారులు ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టే నిర్మాణాలపై ఒక్కోసారి ఒక్కో విధంగా వ్యవహరిస్తున్నారు. దూలపల్లిలోని సర్వే నెంబర్ 21లో 20 ఎకరాల 14 విస్తీర్ణంలో లింగయ్య చెరువు విస్తరించి ఉంది. చెరువును ఆనుకొని 19, 20 సర్వే నెంబర్లలో ఎఫ్‌టీఎల్ స్థలం విస్తరించి ఉంది. గతంలో ఈ సర్వే నెంబర్లలో కొన్ని నిర్మాణాలు వెలిసినప్పుడు ఇరిగేషన్ కొంపల్లి, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా కలిసి కూల్చి వేశారు. కొన్నింటిని వదిలేశారు. చీకటి ఒప్పందంతో వదిలేసినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. తాజాగా ఓ వ్యక్తి 60 గజాలలో నిర్మాణం చేపడుతుండగా.. నాలుగు రోజుల క్రితం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఇదే గది పక్కన ఓ వ్యక్తి సుమారు 400 గజాలలో రేకులతో షెడ్డు వేసి అద్దెకు ఇస్తున్నాడు. అధికారులు మాత్రం పక్కనే ఉన్న ఈ షెడ్డును ఏ మాత్రం పట్టించుకోకుండా కేవలం 60 గజాల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం కొరకు బేస్‌మెంట్ నిర్మాణం చేపడుతుండగా కూల్చివేశారు. దీంతో సదరు యజమాని కొంపల్లి మున్సిపల్ కమిషనర్‌ను ఈ విషయమై అడగగా.. 'నీపై ఫిర్యాదు వచ్చిందని, వారిపై ఫిర్యాదు రాలేదని' సమాధానం చెప్పాడు. దీంతో సదరు వ్యక్తి 400 ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలసిన షెడ్డు నిర్మాణంపై మంగళవారం ఫిర్యాదు చేశారు.



ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన రేకుల షెడ్డు